# పెళ్ళి చూపులు

ధరణీప్రగడ వెంకటశేషగిరిరావు

తోట పక్కనుంచి హాలులోకి వెళుతున్న మూడేళ్ళ పాపను— "ఇలా రా, అమ్మా!" అంటూ పిలిచాడు సుందరరావు.

చిన్నపాప పువ్వులు చప్పుడు చేసుకుంటూ, ముద్దుగా నడిచి వచ్చింది. పాపను ఒళ్ళో కూర్చోబెట్టుకుని, "నాలుక చాపమ్మా!" అన్నాడు.

పాప నాలుక చాపింది. తనతో తెచ్చుకున్న స్టాంపులు ఆమె నాలుకపై ఊడ్చి, కవరుకు అంటించుకున్నాడు. తరవాత జేబులోంచి ఒక చాకొలెట్ తీసి ఆమె నోట్లో పడేసి, "అన్నయ్యను పిలుచుకు రా, అమ్మా!" అన్నాడు.

పాప తన అన్న అయిన సూరిబాబును పిలుచుకు వచ్చింది.

సూరిబాబు, సుందరరావు ప్రాణ స్నేహితులు. వాళ్ళు ఎప్పుడూ విడిపోని జంట. వాళ్ళలో వాళ్ళకు ఏమి కావలసినా సహాయం చేసుకుంటారు. ఎక్కడకు వెళ్ళినా ఇద్దరూ కలిసి వెళతారు.

"ఒరేయ్, సూరిబాబూ, ఈ వేళ ఒక కథ పంపిస్తున్నారా. ఇదిగో చదివి చూడు" అన్నాడు సుందరరావు.

సూరిబాబు కథ అందుకొని చదవడం మొదలుపెట్టాడు. "అది కొబ్బరికాయ కాదు. అది ఆమె తలకాయ. అది కొబ్బరి పీచు కాదు. అది ఆమె జుట్టు. ఏమిటిరా, ఈ బొంద? ఇదేమి కథ?" అన్నాడు గట్టిగా నవ్వేస్తూ సూరిబాబు.

"ఏరా, బాగాలేదా?" అమాయకంగా అడిగాడు సుందరరావు.

"అబ్బే. చాలా బాగుంది. లేకపోతే నన్ను బ్రతకనిస్తావు?"

"పూర్తిగా చదువు మరి."

మరల చదవడం మొదలుపెట్టాడు సూరిబాబు. "వెన్నెల చచ్చిన వాడి శవంలా చల్లగా ఉంది. ఏమిటిరా ఈ ఉపమానం?"

"మరి వెన్నెల ఎలా ఉంటుందిరా?"

"ఐసుముక్కలా చల్లగా ఉంటుంది. లేకపోతే పీడి ముఖానికి కథలే తక్కువ వచ్చినట్టు."

"అవుతులే గాని, బ్రదర్, నాకు ఒక సహాయం చేయాలి." దీనంగా ప్రార్థించాడు సుందరరావు.

"ఏమిటి?" అన్నాడు కథ పక్కన పడేసి, సూరిబాబు.

"చెప్తానంటే."

"తెలియకుండా ఏమి చెయ్యను? అసలు నే చెయ్యగలిగిన సహాయమేమిటి?"

"అయితే విను." చెప్పడం మొదలుపెట్టాడు సుందరరావు. "నాకు పెళ్ళిట."

"ఎవ రన్నారుట."

"అసలు వినరా."

"మరి చెప్పరా."

"మా బామ్మ నాన్నను పట్టుకుని నాకు పెళ్ళి చెయ్యమంటోంది. మా నాన్న 'సరే' నన్నాడు. ఆవిడకు తెలుసున్న వాళ్ళెవరో దాపురించారట. ఆమెను అడిగారట. ఆమె సరే నందిట. తరవాత చెప్పింది. కట్నం పది వేలు ఇస్తారట. అమ్మాయి బాగుంటుందిట. కాని, కొద్దిగా నలుపట. మరీ కాకి అంత కాదుట. అమ్మాయి అందగత్తెనట. కాని, ఒక కాలు కొద్దిగా పొడుగుట. దానికి పెద్ద పట్టించుకోనక్కర లేదు అంటోంది. ఒక చెయ్యి కొద్దిగా పొట్టిట. ఫరవాలేదంది. ఒక చెవి సగమే ఉందిట. కాని, చెవుడు కాదుగా అంది. ఒక కన్ను కొంచెం మెల్లకన్నులాగుంటుందిట. కానీ పెద్దగా కాదుట. గుడ్డి కంటే మెల్ల మేలుట. కనక ఈ సంబంధం చేసుకోమంటోంది మా నాన్నని."

"ఏమిటీ? మీ నాన్నకు రెండో పెళ్ళా?" పరధ్యానంగా ఉన్న సూరిబాబు ఒక్కసారిగా అడిగేశాడు.

"ఛీ! కాదురా. నాకు చేసుకోమంటోంది." విచారంగా చెప్పాడు సుందరరావు.

"చేసుకుంటా నన్నమాట."

"ఈ పెళ్ళి చేస్తానంటే నూతిలో పడి చస్తానన్నాను."

"మరి ఏమన్నారు?"

"మా బామ్మ, 'అయ్యో! పది వేలు ఎట్లా వస్తాయిరా, మరి?' అంది. మా నాన్నను కాకా పట్టాను. ఈ సంబంధం వదిలేస్తా నన్నాడు."

"మరి ఇంకెందుకు?"

"మరల ఇంకొక సంబంధం చూస్తారా."

"ఇంతటి చక్కని అమ్మాయేనా ఆమె కూడా?"

"కాదులే. బాగానే ఉంటుందిట."

"మరి చేసుకో."

"అయ్య బాబోయ్! నాకు అప్పుడే పెళ్ళా? వద్దురా." దీనంగా ముఖం పెట్టాడు సుందరరావు.

"మానెయ్యి."

"మరి మా నాన్న ఊరుకోవడం లేదు. రేపు వారం శుక్రవారం నాడు పిల్లని చూడాలి పద మంటున్నాడు"

"ఆ పిల్ల బాగుంది కదురా?"

"నువ్వెప్పుడు చూశావురా?" ఆశ్చర్యంతో అడిగాడు సుందరరావు.

"ఏమిటి?" క్వెశ్చన్ మార్కులా పెట్టాడు ముఖం సూరిబాబు.

"మరి, పిల్ల బాగుందన్నావు?" మరింత ఆశ్చర్యపోయాడు సుందరరావు.

"అలా చూడరా. ఆ పంతులుగారు పట్టుకెళుతున్న కుక్కపిల్ల ఎంత బొద్దుగా ఉందో. బాగాలేదూ మరి?"

"బాబూ, వినరా. శుక్రవారం నాడు పెళ్ళిచూపులకు పద మంటున్నాడు మా నాన్న."

"వెళ్ళు."

"ఒరేయ్! నాకు అప్పుడే పెళ్ళెందుకురా?"

"మరి నే నేమి చెయ్యనురా?"

"చెబుతా విను. నువ్వు మా వాళ్ళందరకూ తెలుసుగా? అప్పుడే మీ వాడికి పెళ్ళి చెయ్యకండి అని ఉచిత సలహా ఇస్తూ నాలుగు కోతలు కొయ్యరా. బాబ్బాబు ఈ సాయం చేయరా?" చేతులు పట్టుకున్నాడు సుందరరావు.

"నే చెబితే వింటారా?" చెయ్యి వదిలించుకుని అన్నాడు సూరిబాబు.

"అసలు చెప్పరా. ఆ తరవాత సంగతి తరవాత చూడవచ్చు." తన ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు సుందరరావు.

• • •

ఆ రోజంతా విచారంగా ఉన్నాడు సుందరరావు. ఎందుకో అంత విచారం సూరిబాబుకు అంతు పట్టలేదు. కాలేజీ అయ్యాక సాయంత్రం బీచివైపు బయలుదేరా రిద్దరూ.

"ఇలా కూర్చుందాము." తన కోరిక తెలిపాడు సూరిబాబు.

"సరే." తన ఇష్టం చెప్పాడు సుందరరావు.

"అవును గానీ, రావ్వూ, ఏ సి వేళ ఎందుకు అంత విచారంగా ఉన్నావు?" ఉండబట్టలేక అడిగేశాడు సూరిబాబు.

"అప్పుడే మరిచి పోయావా? ఈ వేళ లక్ష్మివారం. మా నాన్న రేపు పెళ్ళి చూపులకు తప్పక వెళ్ళాలంటున్నాడు."

"మరి నే చెప్పినా వినలేదు మీ వాళ్ళు. మీ కేం నాయనా మీ దలాగే అంటారు. మరి మా బాధ్యత మేము నెరవేర్చుకోవద్దా? అంటున్నారు మీ వాళ్ళు. నే నేమి చెయ్యను?" తన విచారం వ్యక్తం చేశాడు సూరిబాబు.

"నువ్వుకూడా మాతో రారా పెళ్ళి చూపులకి."

"ఏమిటీ? ! నేను పెళ్ళి పెద్దనా?" విస్తుబోయాడు సూరిబాబు.

"కాదు. చెపుతా విను. నేను పెళ్ళివారి ముందు ఒక చెయ్యి కదుపుతా."

"అయితే?"

"మేము తిరిగి వచ్చేసేటప్పుడు నీవు వెనక వస్తూ పిల్ల తల్లిదండ్రులకు నాకు పక్షవాతం వల్ల ఒక చెయ్యి పోయిందని చెప్పు." చిన్న ఉపాయాన్ని చెప్పాడు సుందరరావు.

"అయ్య బాబోయ్!" అదిరి పడ్డాడు సూరిబాబు. "అదేం ఖర్మరా?" తమాయించుకుని అడిగాడు.

"మరి ఇంకెలారా? ఈ సహాయం చేయరా. మరి కొంత కాలం తప్పించుకో వచ్చు."

చాలా సేపు తటపటాయించి, "సరే" అని అంగీకారాన్ని సూచించాడు సూరిబాబు.

• • •

"పదండి, ఇదే ఇల్లు." సుందరరావు తండ్రి రంగారావు ఆ ఇంట్లోకి దారి తీశాడు. సుందరరావు, సూరిబాబు, సుందరరావు తల్లి సత్యవతి దేవి ఆయనను అనుసరించారు.

"ఆ, మీరా? రండి, రండి" అంటూ వారికి సోఫాలు చూపి, "లక్ష్మీ! పెళ్ళివారు వచ్చారు. అమ్మాయిని తీసుకురా" అని గట్టిగా ఒక కేక పెట్టాడు లక్ష్మణరావు.

"ఇదుగో, వస్తున్నా." లోపలి నుంచి సమాధాన మిచ్చింది ఆయన భార్య లక్ష్మి.

ఇంతట్లో నౌకరు కారప్పూబూందీ వేసి ఉన్న ప్లేట్లు అందరికీ అందించాడు.

కూతుర్ని ముస్తాబు చేసి తీసుకు వచ్చింది తల్లి. ఆమె తల వంచుకుని వచ్చి చాపపై కూర్చుంది.

సుందరరావుకు దడ పట్టుకుంది. తల ఎత్తకుండా బూందీ ఎడం చేతితో నోట్లో వేసుకుని పరపరా నమిలేస్తున్నాడు. పెదావిడిలో కొన్ని బూందీ పలుకులు బయటికి కొచ్చేస్తున్నాయి.

"అమ్మాయి ఎంత వరకూ చదివిందండి?" మొదలెట్టాడు ప్రశ్నల వర్షం రంగారావు.

ఏమీ పట్టించుకోకుండా కూర్చున్నాడు సుందరరావు ఇంతలో నౌకరు కాఫీ అందించాడు. ఎడమ చేతితో కాఫీ గ్లాసు అందుకొని గబగబా తాగేశాడు.

అడగవలసినవన్నీ అడిగి, "ముహూర్తం పెట్టించండి. అమ్మాయి జాతకం వ్రాయండి" అని తన సమ్మతి తెలియజేశాడు సుందరరావు తండ్రి రంగారావు.

లక్ష్మణరావు ఆశగా సుందరరావు వంక చూశాడు. సుందరరావు ఎడం చేత్తో కుడిచేయిని ఎత్తి ఒళ్ళో పెట్టుకున్నాడు. లక్ష్మణరావు కంగారు పడ్డాడు. కాని, తమాయించుకున్నాడు.

"ఇక మేము వెళ్ళి వస్తాం" అంటూ బయటికి దారితీశాడు రంగారావు. మిగిలిన వారు అతన్ని అనుసరించారు. కాని, సూరిబాబు మాత్రం వెనక మిగిలాడు.

సూరిబాబు కాస్సేపాగి వాళ్ళు బయటికి వెళ్ళాక, "ఏమండోయ్! ఆ అబ్బాయికి పక్షపాతం కుడి చెయ్యి పని చేయదు" అన్నాడు.

"అదే నాకు అనుమానం" లక్ష్మణరావు తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు.

"మరి నే వెళతా."

"బాబూ, ఆగు. నిజం చెప్పి మమ్మల్ని రక్షించావు. ఇంతకీ అసలు నీ కేమవుతాడు?" అన్నాడు లక్ష్మణరావు.

"స్నేహితుడు. చాలా మంచివాడు అతడే మీకు చెప్పమన్నాడు."

"రక్షించారు."

"అయ్యో! ఈ విషయం వలన సంబంధం చెడిందని వ్రాయకండి."

"అలాగే"

"మరి వస్తా" అంటూ బయటికి వచ్చాడు సూరిబాబు.

* * *

"ఏమేవ్! మన వాడికి చూసిన సంబంధం చెడిపోయిందే."

"ఏమిటే? ఆ లక్ష్మణరావుగారి సంబంధమేనా?" దీర్ఘం తీస్తూ అడిగింది ఆయన భార్య.

"వాళ్ళకు దగ్గర సంబంధం ఉందిట. అది ఎట్టి పరిస్థితులలోను వదులుకోను వీలులేదుట."

"పోనీలెండి. వీళ్ళ సంబంధమే కావాలేమిటి? ఏలూర్లో పిల్ల బాగుంటుంది. ఆయనకు ఒక్కతే కూతురు. ఆస్తి వస్తుందని చూశాము గాని, మన మగమహారాజుకు పెళ్ళి అవ్వదా?" దీమాగా చెప్పింది ఆయన భార్య.

మూరుకేసి ఒక మారు చూసి చెప్పడం మొదలుపెట్టాడు రంగారావు భార్యతో- "ఏలూరులో రామయ్యగారని ఒక ప్లీడరు గారున్నారు. ఆయనకూడా వాళ్ళ అమ్మాయికి సంబంధం కోసం తిరుగుతున్నాడు. మన వాడిని గురించి అడిగాడు. ఈ సంబంధం కుదిరిందని చెప్పాను. పోనీ, ఆయనకు ఒక ఉత్తరం వ్రాస్తానులే."

* * *

"ఇదిగో, సత్యవతీ, రామయ్యగారికి ఉత్తరం వ్రాశాను. ఆయన జవాబు వ్రాశారు. వాళ్ళమ్మాయిని చూడటానికి ఆదివారం వస్తామని వ్రాశాను." భార్యకు సంతోషంతో చెప్పాడు రంగారావు.

"ఒరేయ్, సుందరం, ఆదివారం ఏలూరు వెళ్ళాలి. ఆ వేళ ఎక్కడికీ పోకు."

"ఎందుకు, నాన్నా?" లోపలి గదిలో అద్దం ముందు నించుని తల దువ్వుకుంటూ అడిగాడు సుందరరావు.

"అక్కడ ఒక సంబంధం ఉంది, వెళ్ళాలి."

'ఏమిటో ఈ పెళ్ళిగోల!' తనలో తను గొణుగుకొని, గట్టిగా— "నాకు అప్పుడే పెళ్ళెందుకు?" అన్నాడు.

"మళ్ళీ ఎందుకంటావేమిటిరా? నువ్వు ఏడ్చి గీ పెట్టినా నీకు పెళ్ళి చేస్తాను." దీమాగా అన్నాడు రంగారావు.

చిక్కముఖం వేశాడు సుందరరావు ఆ సాయంత్రం సూరిబాబు ఇంటికి వెళ్ళి తన అవస్థ చెప్పి, "ఒరేయ్, సూరీ,



ఈ సారికూడా నువ్వే కాపాడాలిరా" అన్నాడు.

"ఏమొచ్చిందిరా?" నోట్సు రాసుకుంటూ తల ఎత్తి చూశాడు సూరిబాబు.

"నాతో నువ్వుకూడా రావాలిరా." విచారంగా అడిగాడు సుందరరావు.

"పద." లేచి నించున్నాడు సూరిబాబు.

"ఎక్కడికి?"

"నా కేమి తెలుసు? మరి ఎక్కడికి?" ఎదురు ప్రశ్న వేశాడు సూరిబాబు.

"నోట్సు పక్కన పడేసి వినరా. ఏలూరుతో సంబంధం ఒకటి ఉందిట. ఆదివారం అక్కడికి వెళ్ళాలిట. మా నాన్న అప్పుడే డిక్లేరు చేశాడు."

"నే నెందుకురా అనుమానం? మీ వాళ్ళకు తెలిస్తే?"

"బాబ్బాబు, రారా. నన్ను రక్షించరా."

"సరే." అభ్యర్థన త్రోసి పుచ్చలేక పోయాడు సూరిబాబు.

"థాంక్స్‌రా. నా కడుపున పుట్టిన తొలి బిడ్డకు నీ పేరే పెడతా."

"ఏమిటిరా? నీకు అయితే పెళ్ళి చేయవలసిందే."

"బాబోయ్! నువ్వుకూడా నాకు పెళ్ళి చెయ్యాలంటున్నా వేమిటిరా?"

"మరి నా పేరు నీ పిల్లాడికి ఎలా పెడతావురా?"

"పొరపాటున వచ్చిందిరా ఆ మాట. పెళ్ళి పెళ్ళి అని గోల పెడుతుంటే ఆ మాటే వచ్చేసింది."

రైలు దిగి రామయ్యగారి ఇంటి అడ్రెసు చెప్పి, రెండు రిక్షాలు కుదిర్చారు రంగారావుగారు. ఒక రిక్షాలో ఆయన, ఆయన భార్య; రెండవ రిక్షాలో సుందరరావు, సూరిబాబు ఎక్కారు.

పది నిమిషాలలో రామయ్యగారి ఇల్లు చేరుకున్నారు.

రిక్షా లేమిటా అని బయటకు వచ్చారు రామయ్యగారు. వచ్చిన వారిని చూసి, "రండి, రండి. మీ గురించే మాట్లాడుకుంటున్నాము" అంటూ ఉత్సాహంగా వారిని లోపలికి తీసుకు వెళ్ళాడు. అందరూ కుర్చీలలో కూర్చున్నాక అందరికీ కాఫీ అందించా డాయన.

ఇంతలో రామయ్యగారి భార్య విమల, కూతురిని అలంకరించి తీసుకు వచ్చింది. రంగారావుగారు ప్రశ్నలు మొదలు పెట్టాడు.

ఆ అమ్మాయి తల వంచుకుని ఓపిగ్గా సమాధానా లిచ్చింది.

సుందరరావు మాత్రం బుర్ర గోక్కుంటూ కూర్చున్నాడు.

"మా కీ సంబంధం నచ్చిందండీ, రామయ్యగారూ! మన మిక చుట్టాల మవుతామండీ." సంతోషంగా చెప్పాడు రంగారావు.

"అంతా మా అదృష్టం." రామయ్యగారి భార్య అన్నది.

"మరి వస్తామండీ. నాకు చాలా పనులున్నాయి. ముహూర్తం పెట్టించి ఉత్తరం వ్రాయండి. అమ్మాయి జాతకం కూడా ఒక కాపీ పంపండి." పది నిమిషాలు ఊరుకుని అన్నాడు సుందరరావు తండ్రి.

"తప్పకుండా." వెయ్యి కాండిల్ బల్బులా వెలిగింది రామయ్యగారి ముఖం.

రంగారావుగారు సెలవు తీసుకుని బయలుదేరారు. ఆయన భార్యకూడా ఆయనతో నడిచింది. సుందరరావు చేతితో గాలిలో తడుముతూ గుమ్మం పట్టుకుని జాగ్రత్తగా అవతలికి నడిచాడు.

రామయ్యగారికి ఏదో అనుమానం వచ్చింది. అది గమనించిన సూరిబాబు— "ఏమండోయ్! ఇప్పుడేమి గొడవ చేయకండి. మీ అనుమానం తీరుస్తా. ఆ అబ్బాయికి రేచీకటి ఉంది. నా స్నేహితుడు లెండి" అన్నాడు.

"అదేం కుదరదు. ఆయన్ని గట్టిగా అడిగేస్తా." కోపం విజృంభిస్తుండగా అన్నారు రామయ్యగారు.

"అయ్యా! దయ ఉంచండి. మీకు ఇష్టం లేకపోతే మీ సంబంధం మాకు వద్దని వ్రాయండి" అంటూ ఆయన్ని ఆపాడు సూరిబాబు.

"ఇప్పుడు గుమ్మంలోకి వచ్చినప్పుడు అడగక, ఉత్తరం వ్రాసి అడిగేటంతటి ఖర్మ నా కేం పట్టింది?" పెద్దమనిషి తరహాగా అడిగాడు రామయ్యగారు.

"అయ్యో! పెద్దలు తమరలా అంటే ఎలా? నా స్నేహితుని తండ్రికి గుండె జబ్బు ఉంది. ఎక్కువ విచారం వస్తే భరించలేరు. కనికరించండి. ఈ సంబంధం వద్దంటే మీకు వచ్చే నష్టం లేదు. కనక ఈ విషయం వలన మాత్రం సంబంధం వదులు కొనదల్చామని వ్రాయకండి" అంటూ బ్రతిమాలుతున్న ధోరణిలో అడిగాడు సూరిబాబు.

"సరే, నాయనా" అంటూ, "నీ పేరేమిటి, నాయనా?" అని అడిగారు రామయ్యగారు.

"సూరిబాబు లెండి." తమ పాచిక పారినందుకు సంతోషిస్తూ చెప్పాడు.

"మీ ఇల్లెక్కడ? ఏమి చదువుతున్నావు?" శాంతంగా అడిగా రాయన.

"సుందరం వారి ఊరేనండి. బి.కామ్. ఫైనల్ ఇయర్ చదువుతున్నానండి."

"మీ ఊరు తరుచుగా వస్తూ ఉంటానే. మీ ఇల్లు ఎక్కడ?"

"సూర్యారావుపేటండి. కాల్‌టెక్స్ పెట్రోల్ బంక్ పక్కనండి."

"ఏదీ, ఆ తెల్ల మేడేనా?"

"అవునండి. మరి వస్తానండీ." సెలవు తీసుకుని బయలుదేరాడు సూరిబాబు.

"ఏమోయ్, సూరిబాబూ, మేము రిక్షా ఎక్కినా ఇంకా రావు?" అన్నాడు సుందరరావు తండ్రి రంగారావు.

"మంచినీరుతాగి వస్తున్నానండి." తప్పించుకున్నాడు సూరిబాబు.

* * *

రెండు రోజుల తరవాత రామయ్యగారి దగ్గరినుండి ఒక ఉత్తరం వచ్చింది రంగారావుగారికి. చదువుకుని నిట్టూర్చాడు.

పది నిమిషాలు మౌనం దాల్చి, 'సత్యవతీ! రామయ్యగారి సంబంధం కూడా పోయింది. ఇదిగో ఉత్తరం" అని విచారంగా చెప్పా డాయన భార్యతో.

"ఏమని వ్రాశారండీ?" ఆశ్చర్యంగా అడిగిం దామె.

"వాళ్ళావిడ తమ్ముడు వాళ్ళమ్మాయిని తప్పితే ఎవ్వరినీ చేసుకోనని ఉత్తరం వ్రాశాడుట. అతడు ఏదో కంపెనీలో మేనేజరు చేస్తున్నాడట." ఆయన, ఉత్తరంలోని వివరాలు చెప్పాడు.

"ఎవరి రాత ఎలాగుందో ఎవరికి తెలుసునండీ?" వేదాంత ధోరణిలో చెప్పింది ఆమె.

ఆ తరవాత పది సంబంధాలు చెడిపోయాయి. రంగారావుగారికి వాటి మర్మమేమిటో అంతు దొరక లేదు.


ఆ తరవాత నాలుగు రోజులు అనారోగ్య పరిస్థితి వలన ఎక్కడికీ వెళ్ళలే దాయన.

* * *

'ఛీ! ముసలాళ్ళు ఉంటే ఇంతే. నాన్న ఊరుకున్నా, బామ్మ ఊరుకోవటం లేదు. పెళ్ళి పెళ్ళి. ఏమి పెళ్ళో. ఇప్పుడు ఉన్న స్వేచ్ఛ అప్పుడెక్కడుంటుంది?' ఇలా ఆలోచిస్తున్న సుందరరావుకు తల తిరిగిపోతూంది. తను ఎక్కడ ఉన్నాడోకూడా తెలియకుండా పోయింది. రోడ్డుమీద ట్రాఫిక్ చాలా తక్కువగా ఉండటం వల్ల అతనికి ఈ లోకంలోకి రావలసిన అవసరం కలగలేదు.

హఠాత్తుగా...

తలమీద ఏదో గుడ్డ పడడంతో ఉలిక్కిపడి, ముందుకు తూలాడు సుందరరావు. గాలికి గాలిపటంలా ఎగిరిన పమిటను ఒక్కసారి దగ్గరకు లాక్కున్న అమ్మాయి భుజంపై వేసుకుంది. ఈ లోకంలో లేని సుందరరావు తలపై



పడింది ఆ పమిట చివరి భాగం. ఉలిక్కిపడి ముందుకు తూలిన సుందరరావు కింద పడకుండా ఆమె వీపుపై ఆనాడు.

చిన్న ఎగురుతో ఆ అమ్మాయి కంగారుగా పక్కకు జరిగింది. కింద పడబోయి నిలదొక్కుకున్నాడు సుందరరావు.

"ఏయ్ మిస్టర్! ఎలాగుంది?" తీక్షణంగా చూస్తూ అడిగింది ఆ అమ్మాయి.

"ఏమిటా! ఎంతకి కొన్నారు?" అప్రయత్నంగా అడిగాడు సుందరరావు.

"ఏమిటది?" కోపంగా అడిగింది ఆమె.

"ఎక్కడది?" అమాయకంగా అడిగాడు సుందరరావు.

"ఏం, ఒళ్ళు పొగరా?" సూటిగా చూస్తూ అన్న దామె.

"ఎవరికి? మీకా?. . . అబ్బే. . . ఎవరన్నారు? నే నన్నానా?" ఇబ్బంది పడుతూ అడిగాడు.

"ఏమిటి ఈ పొగరు? కనపడిన అమ్మాయిల వెంటపడి. . ."

"క్షమించాలి. నన్నపార్థం చేసుకుంటున్నారు." అడ్డు తగిలా డామె మాటలకు.

"పైగా అపార్థమని వంకా?" నిరసనగా ప్రశ్నించిందామె.

"క్షమించాలి. చిన్న తప్పు జరిగింది. నేను పరధ్యానంగా నడుస్తున్నాను. మీ . . . మీ. . ." తటపటాయించా డతడు.

"ఏమిటి?" ఎదురు ప్రశ్న వేసిం దామె.

"పమిట నా తలపై పడగానే నేను ఇహలోకంలోకి వచ్చాను. కనక మరోలా భావించకండి. ఎక్స్క్యూజ్ మీ" అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

"రోడ్డుమీద పరధ్యాన మేమిటి?" పెద్ద తరహాగా అడిగిం దామె.

"జీవితంలో అనుకోని సమస్యల వలన అనుకోకుండానే పరధ్యానంతో పడతాను." వరసగా చెప్పి, గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

ఒక్క క్షణం ఆమె నిరుత్తరురాలయ్యింది.

'అతడే. పాపం! అనవసరంగా తిట్టాను. ఈ కాలేజీలోనే చదువుతున్నాడన్నమాట. అసలే ఏదో విచారంతో ఉంటే ఇంకా బాధించాను. ఆ తరవాత నాలుగు రోజులనుంచి ఇంకా బాధగా కనబడుతున్నాడు. నే నన్నమాటలకు కాదుగదా?' తనలో తాను అనుకుంది సుమ.

సుందరరావు పుస్తకాలు పట్టుకుని తల వంచుకుని ఆమె ముందునుంచి, ఇంగ్లీషు డిపార్టుమెంటుకు వెళ్ళాడు. అత డామెను గమనించలేదు.

ఒక రోజున ఒంటరిగా రోడ్డుమీద

> భిన్న ధ్రువాలు
> విరుద్ధ స్వభావాలు గల
> స్త్రీ పురుషుల దాంపత్యమే
> చెక్కు చెదరకుండా
> ఉంటుంది. ఒకే స్వభావం
> కల భార్యాభర్తల మధ్య
> ఏ క్షణంలోనైనా తుఫాను
> చెలరేగవచ్చు
> —థియొడర్ పార్కర్

సుందరరావుకు సుమ తారసపడింది. ఆమెను చూడగానే అతనికి ముందుటి విషయం జ్ఞాపకమొచ్చి, సిగ్గుపడ్డాడు. బాధపడ్డాడు తరవాత హఠాత్తుగా ఒక్క దుముకులో వెళ్ళి ఆమె చేయి పట్టి ఇవతలకి లాగాడు. ఒక అంబోతు రంకె వేస్తూ ఆమె పక్కగా దూసుకుపోయింది మరి కొంత దూరంలో ఇంకొక అంబోతు నిలబడి ఉంది

ఆ రెండు అంబోతులు కలియబడ్డాయి.

నిర్విణ్ణురాలైన సుమ తేరుకుని, "థాంక్సు" అంది.

"ఎక్స్క్యూజ్ మీ!" ముందుకు నడిచా డతడు.

ఆశ్చర్యపోయిం దామె. అంతలోనే క్రిందటి సంఘటన గుర్తుకు తెచ్చుకుని సిగ్గుపడిం దామె. మనసులో బాధపడింది.

ఆ రాత్రి వెన్నెలలో మేడ మీద సోఫాలో కూర్చున్న ఆమెకు చదవ బుద్ధి కాలేదు. పుస్తకం పక్కన పడేసింది. ఎంత మరిచిపోదామన్నా ఆ రోజు జరిగిన సంఘటన జ్ఞప్తికి వచ్చి మనసును కలతపెడుతూంది.

'అవును. నాదే తప్పు.' ఒక సారి తనలో అనుకుంది. కాని, లాభంలేకపోయింది. అదే విషయం ఆమెను విచారంలోకి దింపుతూంది.

పున్నమి వెన్నెల. జాజితీగె గాలికి అల్లల్లాడుతూంది. చక్కని జాజిపూల వాసన ఎల్లెడల వ్యాపిస్తూంది. కాని, ఆమెకు అంధకారంలో ఉన్నట్లనిపించింది. పశ్చాత్తాపం మానవుని ఏట్లా చేస్తుంది. 'తను చేసింది తప్పా?' ఆమె తనలోతను వితర్కించుకొంటూన్నది. 'క్షమించమని అడిగితే?' తరవాత కొన్ని సెకనులాగి, 'ఎలా?' అని తల రెండు చేతులతో పట్టుకున్నది. 'ఎలాగయినా క్షమించమని అడగవలసిందే. తప్పు నాదేగా?' మేడ దిగి వచ్చి తన గదిలో మంచంపై పడుకుని కళ్ళుమూసుకుంది.

ఆ సంఘటన ఆమెకు చాలాసేపటి వరకు నిద్రపట్టనీయ లేదు. చివరకు ఎప్పుడో నిద్రలోనికి జారుకుంది.

* * *

'ఏమిటి? కాలేజీకి టైమయితే పుస్తకాలు పుచ్చుకొని ఎదురొస్తున్నాడు?' ఎదురుగా వస్తున్న సుందరరావును చూసి, తనలో తా ననుకుంది సుమ.

తలవంచుకుని వెళ్ళిపోతున్న సుందరరావును, "ఒక్కసారి ఆగండి" అంది సుమ.

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరరావు.

"కాలేజీకి టైము అయితే ఇలా వెళ్ళిపోతున్నా రెందుకు? కాలేజీకి రారా?" అడిగిం దామె.

"కాలేజీ నుంచే వస్తున్నా. కాలేజీ లేదు. సెలవు." జవా బిచ్చా డతను.

"సెల వెందుకు?"

"ఈ వేళ నుంచి స్ట్రైకు మొదలు పెడుతున్నారు. నిన్న అందరికీ నోటీసులు పంపారుట."

"స్ట్రైకెందుకు?"

"ఆంధ్ర వాళ్ళకు ముఖ్యపట్టణమైన హైదరాబాదులో ఉద్యోగా లుండవట. మాకు ఉద్యోగాలు హైదరాబాదులో ఇవ్వాలి. లేకపోతే మా కది ముఖ్య పట్టణ మెందుకు? మాకు వేరు రాష్ట్రం ఏర్పాటు చేయండి అంటూ స్ట్రైకు మొదలు పెట్టారు." చెప్పేసి, వెళ్ళిపోవడానికి కాలు ముందుకు వేశాడు.

"అంత హడావుడి ఎందుకంటి? ఆగండి, నేనూ వస్తున్నా."

"ఏమిటి? మీరూ వస్తారా?"

"ఏమి? ఎందుకు రాకూడదు?"

"అ... అబ్బే. రావచ్చు." తటపటాయిస్తూ ఆమెకేసి చూసి అన్నాడు.

"అంత కోపమెందుకు? గడిచిపోయిన విషయాలకు క్షమించండి. అవి మరిచిపొండి. నా ప్రాణాలు రక్షించారు. కాని, నా కృతజ్ఞతలు అందుకో నిరాకరించారు." ఆమె చిలిపిగా అంది.

"కోపమా! అదెందుకు? ఏదో మానవ సహజమైన సహాయం చేశాగాని, మీకేమి సహాయం చేశాను. ఎవరికైనా చేసేదది." తన ధోరణిలో చెప్పా డతడు.

"సరి పక్సాసండి. ఈ పక్క సందులో మొదటి ఇల్లే మాది" అని ఆమె ఎడమచేతి వైపు నున్న సందులోకి వెళ్ళింది.

* * *

ఒకసారి పార్కులోను, ఒక సారి సినిమా హాలు దగ్గర, బజారులో—ఈ విధంగా ఒకరికి ఒకరు తారసపడేవారు. కొంచెంసేపు మాట్లాడుకొని విడిపోయేవారు.

ఒక సారి పార్కులో ఒకరికి ఒకరు తారసపడ్డారు. సుందరరావు — "మీరు రోజూ పార్కుకు రాకూడదూ? నేనూ వస్తూంటాను. నాకు ఇంటి వద్ద ఏమీ తోచదు" అన్నాడు.

"తప్పకుండా వస్తాను" అంది ఆమె కిలకిలా నవ్వుతూ.

ఆ తరవాత నుండి వారు రోజూ పార్కులో కలుసుకునే వారు. ఒకరిని ఒకరు చూడకుండా ఒక రోజు కూడా ఉండలేక పోయేవారు.

సాయంత్రం ఎప్పుడవుతుందా అని వేచి చూసేవారు. వారి పరిచయం చివరకు ప్రణయంగా మారి పెళ్ళిదాకా వెళ్ళింది.

"మరి మీ నాన్నగారు మన పెళ్ళికి ఒప్పుకుంటారా?" సుందర రావామెను ప్రశ్నించాడు.

"మీ తల్లిదండ్రులను తీసుకొని వచ్చి మాట్లాడించండి. మా నాన్నగారు నాకు సంబంధాలు చూస్తున్నారు." గోముగా పలికింది సుమ.

"సరే. మా నాన్నగారు కూడా నా పెళ్ళి విషయమై తొందర పడుతున్నారు. చాలా సంబంధాలు చూడడం కూడా అయింది."

"మరి ఒక్కటీ కుదరలేదా?"

"కాదు. నేనే ఆపేశాను."

"మీరు వద్దంటే ఆపేశారన్నమాట. ఎంత ఉత్తములండీ మీ నాన్నగారు!"

"నేను చెబితే వినకుండా సంబంధాలు చూసేవారు. నేను ఇలా కాదని కొన్ని నాటకాలాడి తప్పించుకునే వాడిని."

"ఏమిటి? మీరు నాటకాలు కూడా ఆడతారా? !" ఉత్సాహంగా ప్రశ్నించిం దామె.

"గతిలేక. వద్దంటే వినేవారు కాదు. పిల్లని చూడాలని తీసుకు వెళ్ళేవారు. నేను, నా స్నేహితుడు కలిసి ఒక సారి పక్షవాతం వలన చెయ్యి పడిపోయిందని, ఒకసారి చెవుడని, ఒక సారి గుండెనొప్పి అని అనేక సంబంధాలు తప్పించుకున్నాను. కాని, మా నాన్నగారికి తెలియనీయలేదు."

"అయితే, మా ఇంటికీ వచ్చి ఉంటా

లేమో!'' కిలకిలా నవ్వుతూ పలికింది సుమ.

"వచ్చామేమో? అయినా నీ కంత అనుమాన మెందుకు వచ్చింది?" ఎదురు ప్రశ్న వేసి తనూ నవ్వుకున్నాడు.

"ఏమీలేదు. ఒకసారి ఒక సంబంధం వచ్చింది. అతడికి పక్షవాతం వల్ల కుడి చెయ్యి పోయిందని మా నాన్న అన్నారు." తనకు తెలిసింది చెప్పింది సుమ.

"అయితే, మీ నాన్నగారి పేరు?"

"లక్ష్మణరావుగారు."

"నిజమే. మా నాన్నగారు చూసిన మొదటి సంబంధం అదే. అయితే, నీవు మొదటి సంబంధపు పిల్లవా?" ఆశ్చర్యంగా అడిగాడు సుందరరావు.

"ఏమిటీ పిల్లవా?"

"కాదు. పిల్లివి."

"నేను పిల్లినా? అయితే, నా మీద ఆశ వదులుకోండి తమరు" అంటూ బుంగమూతి పెట్టి ముందుకు నడిచింది.

"సుమా! ఆగు, ఆగు."

"నే నాగను. పిల్లి అన్నావుగా?" అప్రయత్నంగా ఏకవచనం ప్రయోగించింది. తరవాత దగ్గర్లో ఉన్న సిమెంటు బెంచీపై కూర్చుంది.

"పిల్లి కావా మరి? పిల్లిలాగా నా మనసు దొంగిలించావుగా!" చిరునవ్వు నవ్వుతూ ఆమెను సమీపించాడు.

* * *

"లక్ష్మీ! ఈ కాలంలో పెళ్ళిచేయడం చాలా కష్టమనుకో. ఒక్కటీ మంచి సంబంధం దొరకదు. ఒక్కగా నొక్క కూతురు. రేపు భీమవరం వెళ్ళాలనుకుంటున్నా" అన్నాడు లక్ష్మణరావు, ఎదురు సోఫాలో కూర్చుని పువ్వులల్లుకుంటున్న భార్య నుద్దేశించి.

"నాన్నా!" అంటూ లోపలి నుంచి పరుగెత్తుకు వచ్చింది సుమ.

"ఏమమ్మా?" అన్నాడాయన.

"నా కే సంబంధం చూడద్దు." గోళ్ళు గిల్లుకుంటూ గోముగా పలికిందామె.

"అదేమిటమ్మా? నా బాధ్యత నెరవేర్చవద్దా? ఊళ్ళో వాళ్ళు ఏమంటారు?" బుజ్జగిస్తున్నట్టుగా చెప్పా డాయన.

"నా పెళ్ళే మీకు ముఖ్య సమస్యా?"

"కాదా మరి?"

"అయితే, నా కిష్టమైన సంబంధం చెయ్యాలి."

"అంటే?" చిరునవ్వు నవ్వుతూ చూశా డామెవైపు.

"మీకు శ్రమ అక్కరలేదని." కొంటెగా చెప్పిం దామె.

"ఏమిటి? నాకు శ్రమా? చాలా వింతగా మాట్లాడుతున్నావే! ఎవరినైనా ప్రేమించావా?" అనుమానంగా అడిగా డాయన.

"అవును."

"అందుకనే కంగారు పడుతున్నా. అనుకున్నంతపనీ అయిందన్నమాట!" ఆయన నిట్టూర్చారు.

పువ్వు లల్లుకుంటున్న ఆయన భార్య ఒక్కసారి తల ఎత్తింది.

"నాన్నా! మీ కెందుకంత భయం? మీకు తలవంపులు అయే పనేమీ చెయ్యలేదు. మీరు ఒక సారి చూసిన సంబంధమే." ఉత్సాహంగా చెప్పింది సుమ.

"ఏమిటీ? నేను చూసిన సంబంధమా?"

"అవును. ఒక సారి మీరు చెప్పారు. పక్షవాతం వల్ల అతడికి కుడి చెయ్యి పడిపోయిందని."

"ఏమిటీ? పక్షవాతపు వాడిని ప్రేమించావా?" మరింత ఆశ్చర్యపోయా డాయన.

కిలాకిలా నవ్వి, "అక్కడే మీరు పొరపడ్డారు. పక్షవాతం అని వాళ్ళే చెప్పుకుంటా రేమిటి? అది ఆయన, ఆయన స్నేహితుడు ఆడిన నాటకమట. చెప్పాడు నాకు. నే చూశానుగా. చెయ్యి బాగానే ఉంది. నన్ను రక్షించినప్పుడు కూడా చూశాను "అంది.

"అప్పుడే ఆయన అంటున్నావేమిటమ్మా!" కూతుర్ని అడిగా డాయన.

"ఏమిటి? నిన్ను రక్షించాడా అతడు?" తల్లి ప్రశ్నించింది.

"అవును. ఒకసారి ఆంబోతునుండి రక్షించాడు." చీర చేతికి చుట్టుకుంటూ చెప్పింది సుమ.

"సరే. రేపు వెళ్ళి రంగారావుగారితో మాట్లాడతాలే."

"మా మంచి నాన్న!" బుగ్గమీద చిలిపిగా ముద్దు పెట్టి మేడపైకి పారిపోయింది సుమ.

"పిచ్చితల్లి!" నవ్వుకుంటూ అనుకున్నా రాయన.

"తండ్రీ కూతుళ్ళు బలే ఆడుకుంటారే!" నవ్వుతూ అంది ఆయన భార్య.

* * *


"ఏమిటిలా వచ్చారు, లక్ష్మణరావు గారూ?" ఆశ్చర్యంతో అడిగాడు రంగారావుగారు.

"ఏమీ లేదు. మీతో వియ్యం పొందుదామని" అన్నారు లక్ష్మణరావు గారు

"ఏమిటీ! మీ అమ్మాయికి పెళ్ళి కాలేదా?"

"లేదు."

"మరి సంబంధం ఏదో వచ్చిందన్నారు."




"లేదండి. మీ వాడికి పక్షవాతమని మీ వాడు మనను ఒక ఆట ఆడించాడు. అదే నిజమని నేను అపోహపడి, మీ సంబంధం వద్దన్నాను."

"అప్పుడే మీ అమ్మాయి పెళ్ళి అయిందనుకున్నామే. కాదన్నమాట."

"ఏమండోయ్, ఇందులో తేలు దూరింది, చూడండి" అంటూ సత్యవతీదేవి డ్రాయరు సొరుగు బయటికితెచ్చింది.

"ఏమిట్వేదీ న్నిండా ఇన్ని ఉత్తరాలు ఉన్నాయి?"

"ఏమో! అబ్బాయి గది దులుపుతూ ఉంటే డ్రాయరులో తేలు దూరింది. అందుకు తెచ్చా నిది."

రంగారావుగారు సొరుగు బోర్లించారు. పెద్ద చిమ్మట ఒకటి పైకి ఎగిరి పోయింది. ఆ ఉత్తరాలన్నీ ఏమిటా అని చూశారాయన. "మీ అబ్బాయికి ఒక కాలు సరిగా పని చేయనప్పుడు ముందుగా ఎందుకు చెప్పలేదు?" అని ఒక ఉత్తరంలోను, "గుండెజబ్బు అయినప్పుడు చెప్పవద్దా?" అని మరొక ఉత్తరంలోను వ్రాసి ఉండడం చూసి విస్తుబోయి, ఒక్కొక్క ఉత్తరం చదవడం మొదలు పెట్టా డాయన.

కొన్ని ఉత్తరాలు లక్ష్మణరావుగారు కూడా చదివారు. వారు ఒకరి నొకరు చూసుకొని తెగ నవ్వుకున్నారు.

"మరి ఏమిటనుకున్నారు!" అంటూ లక్ష్మణరావుగారు గట్టిగా నవ్వేశారు.

ఇంతలో సుమ, సుందరరావులు ఏదో మాట్లాడుకుంటూ లోపలికి వచ్చి, వారి వారి తండ్రులను చూసి ఆశ్చర్యపోయారు.

"ఇంకేమండీ, సంబంధం కుదిరిందిగా, బావగారూ? మనమే ఇక సరి అనాలి. మనం చెయ్యలేని పని వారు చేశారు. ఎలాగయినా నేటి యువతీ యువకులు భలేవారేనండీ" అన్నారు లక్ష్మణరావుగారు.

"అంతేనండీ, బావగారూ!" నవ్వుతూ అన్నారు రంగారావుగారు.

"రక్షించరా, సుందరం, నీకు తప్పించిన రామయ్యగారి సంబంధం నాకు చుట్టుకుంది. వాళ్ళు మా ఇంటి దగ్గరున్నా రిప్పుడు" అంటూ పరుగెత్తుకు వచ్చాడు సూరిబాబు.

"నోరు మూసుకుని పోయి పెళ్ళి చేసుకో" అంటూ నవ్వాడు సుందరం. సుమకూడా నవ్వింది.

"తప్పదన్నమాట" అంటూ వచ్చిన దారినే పరుగెత్తాడు సూరిబాబు.

సంతోషంగా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నా రా ప్రేమికులు. ★